
# జీవయాత్ర

శ్రీ వి. భాస్కర్



ఆమె అరవైయైదేళ్ళ వృద్ధ. కాళ్ళు వూచల్లాగా వున్నాయి. చేతులు పటుత్వంతప్పి సన్నగా ముడతలుబడ్డ శరీరం. వెన్నంటుకున్న కడుపు. అగాధాల్లోంచి తొంగిచూస్తున్న కళ్ళు. తలంతా నెరసిన వెంట్రుకలు. అర్థం రాలిపోయాయి. ఉన్న వెంట్రుకలుగూడా సంస్కారంలేక చిందర వందరగా వున్నాయి. కట్టుకొన్న మలినపు చీరకు సుమారు వేయికంత లుంటాయేమో? చంకన పాతగుడ్డతో తయారుచేసిన సంచి. తూలిపోతున్న శరీరాన్ని స్వాధీనం చేసుకొని నడిపించటానికి ఏడెనిమిది వంపులు తిరిగున్న నుసిబడ్డ ఊతకర్ర.

ఆ కర్ర దప్ప ఆమె కింకెవరూ అప్తులులేరు. చిన్నప్రాయంలోనే తలిదండ్రులు చెల్లుకున్నారు. పెళ్ళిచేసుకొన్న భర్తగూడా తననుండి దూరమైనాడు. ఆనాటినుండి ఈమె తన కష్టంపైనే కడుపు నింపుకోవాల్సి వచ్చింది. నాటినుండీ నేటివరకు యిల్లిల్లూ తిరిగి చిరిగిపోయిన బట్టల్ని మరమ్మత్తుచేసి యింత గంజి సంపాదించి బ్రతుకుతుండేది.

ఇప్పుడామెకు సరిగ్గా చూపానదు. చెవులు వినబడవు..శరీరం పటుత్వంతప్పింది. ఆమె బలంగా వుండే కాలంలో ఎందరి బట్టల్నో మరమ్మత్తుచేసి వారిని సంతోషపెట్టి తనపొట్ట నింపుకునేది. ఇప్పుడు పాపం ఆమె సూదికి నూలుపోచ నెక్కించటానిగ్గూడా సాధ్యంకాక బాధపడేది. బట్టలచిరుగులు సరిగ్గా కనబడవు. ఓపిగ్గాకూర్చుని కుట్టటానికి శక్తి లేదు.

ఇన్నిరోజులూ ఆమె వస్తుంటే ప్రతి గృహంలోనూ కుప్పలు, కుప్పలుగా బట్టలిచ్చి కుట్టించుకునేవారు. ఆమె నేస్తేకు అందరూ ఆమెచేతనే తమ బట్టల్ని కుట్టించుకొనేవారు.

కాని ఇప్పుడామె నెవరూ పిలవటంలేదు. ముందటిలాగా ఆదరించటమూలేదు. జాలికల్గిన ఏ తల్లేనా కాస్త తిండిపెడితే తింటుంది. లేకుంటే ఆ వూరి ముందు చింతచెట్టుక్రింద పడుకొని తన ముందటి జీవితాన్ని నెమరువేసుకొంటుంటుంది.

తన సూది త్రుప్పిపట్టిపోయింది. నూలుకూడా తన సంచిలో ధూళి దూసరితమైంది.

గ్రామంలో గింజల్లేక ప్రజలంతా నాశనమైపోతున్నారు. ఎవర్ని చూచినా ఆకలిదేవత వారి ముఖసీమల్లో తాండవిస్తోంది. రేషన్ షాపుకు రెండువారాలుగా ధాన్యం యివ్వలేదు. ఎక్కడనుండైనా తెచ్చుకుందామన్నా వీల్లేదు. ప్రజలే మలమల మాడిపోతుంటే యిక మన వృద్ధురాలుకూడా ఏంచేస్తుంది? ఉన్నదాంతో కొన్నిరోజులు మేటిరైతులు పోషించారామెని. అందరికీ ఆమెపైని చిన్నప్పట్నుండి ప్రేమ, దయ కాబట్టి అంతవరకూ బ్రతగ్గలిగింది.

యిక వారిగ్గూడా కష్టమయింది. తమకు తామే పోషించుకో లేనపుడు ఎవరుమాత్రం ఏంచేస్తారు? గ్రామంలోని వారంతా చాలామంది దూర ప్రదేశాలకెళ్ళి కూలిచేసి తిండితింటున్నారు. ఆమెకు ఏమీ దొరకలేదు తింటానికి. ఆ చింతచెట్టుక్రింద ఆలాగే క్షుదాగ్ని కీలికల్లో మండిపోతూవుంది.

మబ్బులు ఆకాశమంతా క్రమ్ముకున్నాయి. సుమారు రాత్రి రెండోఝాము ఆరంభమైయుంటుంది. గ్రామస్థులు శవాల్లాగా గృహాల్లో పడివున్నారు. గాలి భీభత్సంగా వీస్తున్నది. జిగేల్ మని మెరుపులు. హృదయాలు దద్దరించేట్లు ఉరుములు, కుంభవృష్టిగా వర్షము. ఆమె ఆ చెట్టుక్రింద ఆలాగేవుంది.

ఎవరికీ గ్రామస్థులకు ఆమెపైని ధ్యానంలేదు. నిద్రావస్థలో ఆకలి, నీరసంతో వుండిపోయారు.

ఉదయం చూచేసరికి ఆమె.........నగ్న స్వప్నంతో తయారుచేసిన జీవితమనే తెర లేచిపోయింది. ఆమె జీవయాత్ర ఆనాటితో ముగిసింది. గ్రామస్థులా వార్త విని రెండు కన్నీటి బొట్లు జార్చారు.